క్లుప్తంగా

'ఉల్లాస్'తో అక్షరాస్యత పెంపు



వెలుగు కార్యాలయంలో విద్యా సామగ్రిని అందిస్తున్న సాంబశివరావు, అప్పలరాజు

కె.కోటపాడు : ఉల్లాస్ కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని నిరక్షరాస్యులను వీవోఏలు నిర్వహించే తరగతుల ద్వారా అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నట్టు ఎంపీడీవో ఎ.ఎ.సాంబశివరావు తెలిపారు. కె.కోటపాడు వెలుగు కార్యాలయంలో సోమవారం ఉల్లాస్ కార్యక్రమానికి సంబంధించి వలంటరీ టీచర్లకు తరగతులను ఏ విధంగా నిర్వహించాలో శిక్షణతో పాటు అభ్యసనా సామగ్రిని ఎంపీడీవో సాంబశివరావు, సూపరింటెండెంట్ ఎస్.అప్పలరాజు అందించారు. ఈ తరగతులను ప్రతి గ్రామంలోను నిర్దేశించిన ప్రాంతాల్లో రాత్రి 7 నుంచి 9 గంటల వరకూ నిర్వహించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం చినబాబు, ఐసీడీఎస్ పీవో మంగతాయారు, ఈవోఆర్డీ రమణి పాల్గొన్నారు.

వి.సంతపాలెంలో సీసీ రోడ్ల నిర్మాణం



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మండల ఇంజినీరింగ్ అధికారి సుమతి

కె.కోటపాడు : వి.సంతపాలెం గ్రామంలో రూ.20 లక్షల ఉపాధి హామీ నిధులతో మూడు ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నట్లు మండల ఇంజినీరింగ్ అధికారి సుమతి తెలిపారు. గ్రామంలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను సోమవారం ఆమె పరిశీలించారు. పనులను నాణ్యతా ప్రమాణాలను పాటించి పూర్తి చేయాలన్నారు. రైతు సేవా కేంద్రం, హెల్త్ వెలెనెస్ భవన పరిసరాల్లో జరుగుతున్న పనులను సుమతి పరిశీలించారు.

కాశీపురం యూత్ ఔదార్యం



బాధిత కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న కాశీపురం యూత్

దేవరాపల్లి: ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన కాశీపురం సీనియర్ ఎల్ఐసీ ఏజెంట్ షేక్ బాబాసాహెబ్(బాబ్జీ) కుటుంబానికి స్థానిక యూత్ బాసటగా నిలిచింది. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులను సోమవారం యూత్ సభ్యులంతా పరామర్శించి ధైర్యం చెప్పారు. స్థానిక యూత్ సమకూర్చిన రూ. 21 వేలు నగదును బాబ్జీ కుటుంబ సభ్యులకు అందజేసి, తమ మానవత్వం చాటుకున్నారు.

తిమిరాంలో నేడు జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు



ముస్తాబైన తిమిరాం సూర్యనారాయణమూర్తి ఆలయం

దేవరాపల్లి: మండలంలోని తిమిరాంలో రథసప్తమి, సూర్యనారాయణ మూర్తి తీర్థం పురస్కరించుకొని మంగళవారం జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలను నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి జరిగే ఈ పోటీలలో గెలుపొందే విజేతలకు వరుసగా రూ.12 వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు, రూ.2వేలు, రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతులను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. రథసప్తమితో పాటు సూర్యనారాయణ మూర్తి తీర్థం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేయనున్నామన్నారు. ఆలయాన్ని ఇప్పటికే ముస్తాబు చేశారు.

నేడు చంద్రమ్మదొర తీర్థం



వీరవల్లి అగ్రహారం కొత్తరోడ్డు వద్ద ఉన్న చంద్రమ్మదొర విగ్రహం

మాడుగుల రూరల్: మాడుగుల సమితి తొలి అధ్యక్షుడు దొండా చంద్రమ్మదొర వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం తీర్థం నిర్వహించనున్నట్లు చంద్రమ్మదొర కుటుంబ సభ్యులు సోమవారం తెలిపారు. వీరవలి అగ్రహారం పెట్రోల్ బంకు పక్కన ఉన్న చంద్రమ్మదొర విగ్రహం వద్ద ఏటా రథసప్తమి రోజున తీర్థం నిర్వహించడం ఆనవాయితీ. దీనిలో భాగంగా విగ్రహం వద్ద ఉదయం జాతీయ జెండా ఆవిష్కరణ, పాఠశాల విద్యార్థులకు పెన్నులు, పుస్తకాల పంపిణీ చేయనున్నారు.

కూరగాయల సాగు.. లాభాల బాగు

- వరి పంట కంటే లాభసాటి
- ఆసక్తి కనబరుస్తున్న రైతులు
- నాతవరం మండలంలో వెయ్యి ఎకరాల్లో సాగు



గంటావారి కొత్తగూడెంలో పందిరిపై బీరసాగు



తాండవ ప్రాంతంలో టమాటా సాగు

నాతవరం: తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్నిచ్చే కూరగాయల సాగుపై రైతులు దృష్టి సారించారు. మండలంలో తాండవ, చమ్మచింత, ఉటమల్ల తాళ్లపాలెం, ఎం.బి.పట్నం, ములగపూడి, పెదగొలుగొండపేట, నాయుడుపాలెం, బాపన్నపేట, ఎస్.బి.పట్నం, తదితర గ్రామాల్లో రైతులు కూరగాయలు పంటలను విస్తృతంగా సాగు చేస్తున్నారు. కురువాడ, గంటావారి కొత్తగూడెం, ఎస్.బి.పట్నం గ్రామాల్లో పందిరి బీర, కాకరపాదులు పండిస్తున్నారు. మిగతా గ్రామాల్లో టమాటా, వంకాయలు, బెండకాయలు, ఉల్లి, మిరప, ములగ, తోటకూర, కొత్తిమీర, కాలీఫ్లవర్, క్యాబేజీ పంటలు సాగు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా సుమారుగా 1000 ఎకరాలకు పైగా కూరగాయలు పండిస్తున్నారు. మిగతా వ్యవసాయ పంటలు కంటే తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. ఇక్కడ పండించిన కూరగాయలను వ్యాపారులు పంట పొలాల వద్దకు వచ్చి కొనుగోలు చేసి పట్టణ ప్రాంతాలకు వాహనాల్లో తీసుకెళ్తున్నారు. మార్కెట్లో కూరగాయల గిరాకీని బట్టి వారానికి ఒక రేటు లభిస్తుందని, వరి పంటతో పోల్చుకుంటే కూరగాయలు ఆదాయం లాభసాటిగా ఉంటుందంటున్నారు. ఇటీవల కాలంలో కోతులు బెడద ఎక్కువైందని, వాటిని నుంచి పంటలను కాపాడుకోవడం ఇబ్బందిగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయల తోటలోకి కోతులు రాకుండా పులిబొమ్మలు ధరించి తిరుగుతున్నామని చెబుతున్నారు.

సరస్వతీ నమస్తుభ్యం..

వసంత పంచమి సందర్భంగా సామూహిక అక్షరాభ్యాసాలు



చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ప్రధానార్చకుడు చలపతిరావు



జంగాలపల్లిలో అక్షరాభ్యాసాలు చేయిస్తున్న ఎంఈవో మూర్తి



కె.కోటపాడులో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్న అర్చకులు

చోడవరం: సామూహిక అక్షరాభ్యాసాలు ఎంతో సందడిగా సాగాయి. పంచాష్టమి సరస్వతీదేవి అమ్మవారు పుట్టినరోజు సందర్భంగా ఆలయాలు, పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో వందలాది మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేశారు. ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మండపంలో ఉచిత సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేద పండితుడు కొడమంచిలి చలపతిరావు పర్యవేక్షణలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. స్వయంభూ విఘ్నేశ్వరస్వామికి, సరస్వతీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు జరిపారు. పలకా, బియ్యంలో చిన్నారులు బలపం చేతపట్టి అక్షరాలు దిద్దారు. మరో పక్క చోడవరంలో ఉషోదయ విద్యాసంస్థల ఆవరణంలో చైర్మన్ జెర్రిపోతుల రమణాజీ ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. ఈ సందర్భంగా సరస్వతీదేవి అమ్మవారికి ప్రత్యేక హోమం జరిపించారు. శ్రీమహతి స్కూల్, విజ్ఞాన్ స్కూళ్లలోనూ సామూహిక అక్షరాభ్యాసం చేశారు. చోడవరం మండలంతో పాటు పరిసర మండలాల నుంచి పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు తమ పిల్లలతో వచ్చి అక్షరాభ్యాసాలు చేయించడంతో చోడవరం అంతా సందడిగా మారింది.

మాకవరపాలెం: మండలంలోని జంగాలపల్లిలో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. వసంత పంచమి సందర్భంగా సోమవారం స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థులకు అక్షరాభ్యాసాలు చేశారు. ఈ అక్షరాభ్యాసాల్లో ఎంఈవో మూర్తి పాల్గొని పిల్లలతో అక్షరాలు దిద్దించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఎప్పటికప్పుడు తమ పిల్లల పరిస్థితిపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. పిల్లలతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రామచంద్రమూర్తి, చైర్మన్ నాగకాంతం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసాలు

కె.కోటపాడు : కె.కోటపాడు, చౌడువాడ, ఎ.కోడూరు గ్రామాల్లోని పాఠశాలల్లో సోమవారం వసంత పంచమి పర్వదినం సందర్భంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఎ.కోడూరు హైస్కూల్‌లోని సరస్వతీదేవి మందిరంలోను, చౌడువాడ సాయి విద్యావిహార్, కె.కోటపాడు అయ్యన్న ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్ద సంఖ్యలో చిన్నారులు అక్షరాభ్యాసం చేశారు.

అన్నదానానికి విరాళం



విరాళం అందిస్తున్న రాజేశ్

మాడుగుల రూరల్: వచ్చే నెలలో వడ్డాది వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగే నాగవల్లి సంబరాల్లో భాగంగా అన్నసమారాధనకు ఎం.కోడూరు గ్రామస్తులు గొల్లవిల్లి రాజేశ్, వరలక్ష్మి దంపతులు సోమవారం విరాళం అందజేశారు. రూ.10,116 నగదును బంగారమెట్ట గ్రామానికి చెందిన అన్నదాన కమిటీ సభ్యుడు నాగేశ్వరరావుకు అందించారు.

భక్తిశ్రద్ధలతో గౌరీపరమేశ్వరుల నిమజ్జనం



గౌరీపరమేశ్వరులను ఊరేగింపు చేస్తున్న స్థానికులు

మాకవరపాలెం: గౌరీ పరమేశ్వరుల నిమజ్జనం సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని కొండల అగ్రహారంలో గౌరీ పరమేశ్వరులను నిలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో రెండు రోజులపాటు తీర్థ మహోత్సవాలు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గౌరీపరమేశ్వరుల ప్రతిమలను అన్ని వీధుల్లోనూ ఘనంగా ఊరేగించారు. అనంతరం నిమజ్జనం చేశారు. ఊరేగింపులో భారీ ఎత్తున మహిళలు, సర్పంచ్ పోలిరెడ్డి అచ్చియ్యమ్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమావేశమైన 1989-92 బ్యాచ్ విద్యార్థులు

చోడవరం: స్థానిక బాలికోన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన 1989–1992 బ్యాచ్ విద్యార్థినులు సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వీరంతా పాఠశాల ప్రాంగణంలో కలుసుకుని సందడి చేశారు. చదువుకున్న రోజులను గుర్తు చేసుకుని ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. తాము ఉన్నతంగా ఎదగడానికి బాటలు వేసిన ఉపాధ్యాయులు కమలా, నవ మాలిని, సుందరి, మంగ కుమారి, గాయత్రి, విజయలక్ష్మిలను స్వయంగా కలుసుకొని తరగతి గదుల్లో జరిగిన అప్పటి ముచ్చట్లను పంచుకున్నారు. గురువులను సన్మానించారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి సహకరించిన పాఠశాల హెచ్ఎం వి.రామిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

నర్సీపట్నంలో గీత కార్మికుల మద్యం షాపు

- కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవుడు డిమాండ్
- ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న యాత కులస్తులు

నర్సీపట్నం: కల్లుగీత ఉప కులమైన యాత మద్యం రిజర్వేషన్ షాపును నర్సీపట్నంకు కేటాయించాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర దేవుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద యాత కులానికి చెందిన నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో వి.వి.రమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవుడు మాట్లాడుతూ రిజర్వేషన్ ప్రకారం మద్యం దుకాణాలను నర్సీపట్నం మండలంలోని గీత కార్మికులకు కేటాయించలేదన్నారు. రిజర్వేషన్ ప్రకారం నర్సీపట్నం పరిధిలో కేటాయించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. ఈ ధర్నాలో సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తిన నాగేశ్వరరావు, డివిజన్ అధ్యక్షులు తాతబాబు, లోవ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనే ధ్యేయం



నూతనంగా ఎన్నికైన మండల దళిత సంఘాల ఐక్య వేదిక కార్యవర్గ సభ్యులు

దేవరాపల్లి: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయ సాధనే ధ్యేయంగా దళితులంతా ఐక్యతగా పని చేస్తామని మండల దళిత సంఘాల ఐక్య వేదిక సభ్యులు తీర్మానించారు. మండల స్థాయి దళిత సంఘాల ఐక్య వేదిక సమావేశం దేవరాపల్లిలోని శ్రీనన్యాసమ్మ ఆలయ ఆవరణలో సోమవారం జరిగింది. మండల నాయకుడు కాటపల్లి అప్పారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అణగారిన వర్గాలను అణిచివేసే కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. గ్రామాల్లో వివిధ శాఖలుగా ఉన్న దళిత సంఘాలు అన్నీ కలిసి మండల అంబేడ్కర్ ఆశయ సాధన సమితిగా ఆవిర్భవించిందన్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ సమన్వయకర్తగా నబ్బువరపు మాలిబాబును నియమించారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా కార్లి సాయి సుందరరావు, అధ్యక్షుడిగా కాటపల్లి అప్పారావు, ఉపాధ్యక్షుడిగా దువ్వాడ రమేష్, ప్రధాన కార్యదర్శిగా పతివాడ నాగభూషణం, సహాయ కార్యదర్శిగా తాడి అప్పారావు, కోశాధికారిగా కంచమాల అప్పారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మచ్చ రామారావు తదితర కార్యవర్గ సభ్యులు, సహాయ కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉల్లి దేముళ్లు, కె.అప్పారావు, దేగల సుదర్శన్, మల్లేటి అర్జున్, చెక్క శ్రీను, కడారి రాజు, ఉల్లి సింహాద్రి, కాటపల్లి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లోనే ఎండుతున్న చెరకు



కె.జె.పురంలో చెరకు తోటలో ఎండుతున్న చెరకు

మాడుగుల రూరల్: గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో ఇటీవల ఏర్పడిన సాంకేతిక కారణాల వల్ల చెరకు క్రషింగ్ ఆలస్యంగా జరుగుతోంది. దీంతో చెరకు కాటాల వద్ద చెరకు బండ్లు ఎండకు ఎండుతున్నాయి. మరో వైపు పంట పొలాల్లో కొట్టిన చెరకుపై పిప్పి కప్పి ఉంచారు. మండలంలో కె.జె.పురం, ఘాట్ రోడ్డు చెరకు కాటాలు నుంచి చెరకును గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి తరలించడానికి లారీల సంఖ్య పెంచకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కె.జె.పురం చెరకు కాటా నుంచి ఒక లారీ మాత్రమే తిరుగుతుందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే అంతంత మాత్రంగా చెరకు పండిస్తున్న రైతులు.. సకాలంలో చెరకును ఫ్యాక్టరీకి తరలించకపోతే తీవ్రంగా నష్టపోతారని రైతు బొడ్డేడ వెంకటరావు ఆవేదన వ్యక్తం చేశారు. కాటాల నుంచి ఫ్యాక్టరీకి చెరకు తరలించడానికి లారీల సంఖ్యను పెంచాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మోదమాంబ ఆలయంలో అభివృద్ధి పనులకు విరాళం



ఎం.కోడూరు మోదమాంబ ఆలయంలో విరాళం అందిస్తున్న పుట్టా మోహన్‌రావు దంపతులు

మాడుగుల రూరల్: ఎం. కోడూరు మోదమాంబ ఆలయంలో పలు అభివృద్ధి పనులకు సత్యవరం గ్రామానికి చెందిన పుట్టా మోహన్‌రావు, కళావతి దంపతులు, కుమారుడు సాయి ప్రసాదు రూ 50,000 నగదుతో పాటు 50 బస్తాల సిమెంటును ఆలయ కమిటీ చైర్మన్, సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావుకు సోమవారం అందజేశారు. ఈ నిధులతో భక్తుల కోసం పైపులైన్లు, వాటర్ ట్యాంకు, కుళాయిల నిర్మాణం చేపట్టనున్నట్టు చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ముమ్మిన రమణబాబు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, స్థానికులు పడాల వెంకటరాజు, కలిమి గోపాల్, నాగరాజు, జగదీష్, శివ పాల్గొన్నారు.

ఆరు గంటలకే ఉపాధి పనులు ప్రారంభించండి



దిబ్బిడిలో ఉపాధి పనులను పరివేక్షిస్తున్న ఎంపీడీవో విజయలక్ష్మి

బుచ్చెయ్యపేట: వేసవి కాలం ప్రారంభం అవడంతో ఉపాధి హామీ పథకం పనులు ఉదయం 6 గంటలకే ప్రారంభించాలని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె దిబ్బిడి వంక చెరువులో జరుగుతున్న జాతీయ ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. మస్టర్ షీట్లను పరిశీలించి 225 మంది కూలీలు పనులకు వచ్చినట్లు గుర్తించారు. మేట్లు ద్వారా కూలీలకు కొలతలు ఇచ్చి నిబంధనలు ప్రకారం ఉపాధి పనులు జరిగేలా చూడాలన్నారు. ప్రతి కూలీకి రోజువారి వేతనం రూ.300 అందేలా చూడాలని ఏపీవో వరహాలబాబుకు సూచించారు. అన్ని గ్రామాల్లో కూలీలకు ఉపాధి పనులు కల్పించాలన్నారు.

పోలీసు బందోబస్తు నడుమ జీడి తోటల వేలం



అటవీ కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు

నర్సీపట్నం: నర్సీపట్నం అటవీ డివిజన్ పరిధిలోని జీడి మామిడి తోటలకు పోలీసు బందోబస్తు నడుమ సోమవారం అటవీ అధికారులు వేలం నిర్వహించారు. అటవీ భూములను ఆక్రమించుకుని సాగు చేస్తున్న పలువురు ఇటువంటి సమయంలో నిరసన వ్యక్తం చేస్తుంటారు. అటువంటి సంఘటనలు తలెత్తకుండా టౌన్ ఎస్ఐ రమేష్, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. పెడిమికొండ 5,200, టి.జగ్గంపేట 8,700, చినరాచపల్లి 220, ఆరిలోవ 48 జీడి చెట్లకు వేలం నిర్వహించారు. సబ్ డీఎఫ్‌వో సునీల్, రేంజర్ లక్ష్మీనర్సు సమక్షంలో వేలం నిర్వహించారు. ఈ జీడి తోటల ద్వారా అటవీ శాఖకు ఏటా సుమారు రూ.16 లక్షలు ఆదాయం వస్తుందన్నారు.

సంతలో కొండ చీపుర్లకు గిరాకీ



మాడుగుల వారపు సంతలో కొండ చీపుర్ల విక్రయాలు

మాడుగుల: మాడుగులలో సోమవారం జరిగిన వారపు సంతలో దళారులు రంగంలోకి దిగడంతో కొండచీపుర్లకు గిరాకీ ఏర్పడింది. గిరి రైతులు మన్యం నుంచి మాడుగుల వారపు సంతకు ఉదయం 5 గంటలకు కొండ చీపుర్లు తీసుకు వచ్చారు. దళారులు ఒక్కొక్కటి రూ.60 చొప్పున కొనుగోలు చేసి, మళ్లీ స్థానికులకు ఒక్కొక్కటి రూ.100 నుంచి రూ.120 చొప్పున విక్రయించి సొమ్ము చేసుకున్నారు.

నేడు కుంకుమ పూజలు

మాడుగుల: మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో మంగళవారం కుంకుమ పూజలు నిర్వహించ నున్నామని ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. గ్రామంలో వీధి పండగలను పురస్కరించుకుని ఈ పూజలకు ఏర్పాట్లు చేశామన్నారు.

ఎలక్ట్రికల్, ప్లంబర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మాకవరపాలెం: ఎలక్ట్రికల్, ప్లంబర్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ(నాక్) ఏడీ రవికుమార్ సోమవారం తెలిపారు. మండల కేంద్రంలోని నాక్ శిక్షణా కేంద్రంలో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. 15-45 ఏళ్లలోపు వయసు ఉండి, పదో తరగతి చదివిన వారు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులన్నారు. ఎలక్ట్రికల్ కోర్సు వివరాలకు 9394885164, ప్లంబర్ కోర్సుకు 7075340910 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పదో తరగతి స్టడీ మెటీరియల్ పంపిణీ

రోలుగుంట: మండలంలో జె.నాయుడుపాలెం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యూటీఎఫ్ రూపొందించిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను సోమవారం హెచ్ఎం డి.రమేశ్‌కుమార్ అందజేశారు. ఈ మెటీరియల్‌ను మండలంలోని అన్ని హైస్కూళ్లలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్నట్లు యూటీఎఫ్ కోశాధికారి డి.అప్పారావు, తెలిపారు.

విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలి

మాకవరపాలెం: ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలని ఎంఈవో మూర్తి సూచించారు. ఉగాది సందర్భంగా గౌతమిలలిత కళా శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో ఏటా ప్రతిభా పాటవ పోటీలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యతో పాటు ఇతర రంగాల్లోనూ విద్యార్థులు తమ సత్తా చాటుకోవాలన్నారు. ఈ నెల 21 వరకు విద్యార్థులకు చిత్రలేఖనం, క్విజ్, నృత్యం, స్పెల్-బీ, పద్య పోటీలు నిర్వహిస్తామని శిక్షణా కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు రంగరాజు, శేషగిరిరావు తెలిపారు.

పది మద్యం బాటిళ్ల పట్టివేత

బుచ్చెయ్యపేట: మండలంలోని బుచ్చెయ్యపేట రోడ్డులో పది మద్యం బాటిళ్లను తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం వాహనాల తనిఖీలో భాగంగా బంగారుమెట్టకు చెందిన వ్యక్తి బుచ్చెయ్యపేట నుంచి 10 మద్యం బాటిళ్లతో వెళ్తుండగా పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

నేడు బంగారమ్మతల్లి పరస

కె.కోటపాడు : ఆర్.వై.అగ్రహారంలో మంగళవారం బంగారమ్మతల్లి అమ్మవారి పరస జరగనుంది. ప్రతి ఏటా రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామస్తులు తీర్థం చేయనున్నారు. బంగారమ్మ ఆలయం వద్ద భక్తులు పూజలను జరిపేందుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇప్పటికే కమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు. పలు పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.